క్లుప్తంగా

ఆప్ శేరిలింగంపల్లి కన్వీనర్‌గా మహ్మద్ అలాయుద్దీన్ పటేల్



అలాయుద్దీన్ పటేల్‌కు నియామక పత్రాన్నిస్తున్న సుధాకర్

హఫీజ్‌పేట్: ఆమ్ ఆద్మీ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం కన్వీనర్‌గా మహ్మద్ అలాయుద్దీన్ పటేల్ నియమితులయ్యారు. ఆదివారం ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ డి.సుధాకర్, చేవెళ్ల లోక్‌సభ ఇంచార్జి మహ్మద్ మాజిద్‌లు ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీ తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సురేష్ ముదిరాజ్



నియామక పత్రాన్ని అందుకుంటున్న సురేష్ ముదిరాజ్

మియాపూర్: బహుజన్ సమాజ్ పార్టీ రంగారెడ్డి జిల్లా (వెస్ట్ జోన్) ప్రధాన కార్యదర్శిగా మియాపూర్‌కు చెందిన శంకరోల్ల సురేష్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రంగారెడ్డి జిల్లా వెస్ట్ జోన్ అధ్యక్షుడు జయసింహా రాచమల్ల చేతుల మీదుగా శంకరోల్ల సురేష్ ముదిరాజ్ నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం సురేష్ ముదిరాజ్ మాట్లాడుతూ... తనపై నమ్మకం జిల్లా బీఎస్పీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు రాచమల్ల జయసింహలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలతో కలిసి సమన్వయంతో పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

ప్రత్యేక అలంకరణలో రేణుక ఎల్లమ్మ

పటాన్‌చెరు టౌన్: ప్రత్యేక అలంకరణలో రేణుక ఎల్లమ్మ భక్తులకు దర్శనమిచ్చింది ఆషాడమాసం చివరి ఆదివారం కావడంతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవడానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా పటాన్‌చెరు పట్టణంలోని పోచమ్మ ఆలయం, మంజీరా క్యాంపస్‌లోని పెద్దమ్మతల్లి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించారు.

దొంగతనాల నివారణపై అవగాహన



రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలో నిర్వహించిన బోనాల పండుగ సందర్భంగా ఆదివారం ఆలయాల వద్ద దొంగతనాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులు భక్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐలు వెంకటేష్, శశికాంత్‌రెడ్డి, నరసింహులు మాట్లాడుతూ భక్తులు తమ విలువైన వస్తువులను పోగొట్టుకోకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

రూ.89వేలు, ఆరు సెల్‌ఫోన్‌లు, ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

పటాన్‌చెరు టౌన్: పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్‌ఐ రామానాయుడు కథనం ప్రకారం..పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఏడుగురు పరారీలో ఉన్నారు. వారి వద్ద నుంచి రూ.89వేలు నగదు, ఆరు సెల్ ఫోన్‌లు, ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

జిన్నారం(పటాన్‌చెరు): ఖాజీపల్లి గ్రామ శివారులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వివరాలు ఇలా ఉన్నాయి..జిన్నారం మండలంలోని ఖాజీపల్లి గ్రామశివారులోని ఇటుక బట్టీ సమీపంలో ఓ వ్యక్తి మృతి చెందిన విషయాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారాన్ని చేరవేశారు. దీంతో సంఘటనా స్థలాన్ని సీఐ నయీముద్దీన్ సందర్శించారు. సుమారు 35ఏళ్ల వయస్సు మృతదేహం లభ్యమైనట్లు చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



గోపన్‌పల్లిలో అమ్మవారు



వేడుకల్లో పాల్గొన్న గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా



కొత్తగూడలో బోనాలను తీసుకెళ్తున్న మహిళలు



తారానగర్‌లో...

బోనం.. వైభోగం

- బోనమెత్తిన శేరిలింగంపల్లి
- వాడవాడలా బోనాల సందడిగా సంబురాలు
- ఎక్కడ చూసినా కోలాహలం
- శేరిలింగంపల్లి జంట సర్కిళ్లలో భక్తులతో కిటకిటలాడిన అమ్మవారి ఆలయాలు

శేరిలింగంపల్లి జోన్ బృందం: భక్తిపారవశ్యం... శివసత్తుల పూనకాలు.. పోతురాజుల విన్యాసాలు.. డప్పు చప్పుళ్లు... యువతీయువకులు నృత్యాలు... ఘటాల ఊరేగింపులు.. భక్తుల కోలాహలం నడుమ బోనాల జాతర సంబురాలు శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నంగా నిలిచే బోనాలను ప్రజలు ఆనందోత్సవాలు, భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుపుకొన్నారు. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్లలోని కాలనీలు, బస్తీలలో వెలిసిన పోచమ్మ, మైసమ్మ, పెద్దమ్మ, ఊరపోచమ్మ, నల్లపోచమ్మ, ఎల్లమ్మ, రేణుకా ఎల్లమ్మ, మహంకాళీ అమ్మవార్ల ఆలయాల్లో బోనాల పర్వదినాన్ని వైభవంగా నిర్వహించారు. కాలనీ, బస్తీలోని అమ్మవారి ఆలయాలకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



నానక్‌రాంగూడలో భారీ తొట్టెల ఊరేగింపుతో పోచమ్మ దేవాలయానికి తీసుకెళ్తుతున్న భక్తులు



హఫీజ్‌పేట్‌లో పోతురాజుల విన్యాసాలు



తారానగర్‌లోని తుల్జాభవానీ ఆలయంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు



శేరిలింగంపల్లిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్...



శేరిలింగంపల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు రఘునాథ్‌యాదవ్...



గచ్చిబౌలిలో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి...

అంటువ్యాధులపై మరింత అవగాహన అవసరం

నానక్‌రాంగూడలో మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఇన్ఫెక్షియస్ డిసీజ్ కాన్ఫరెన్స్



ఐడీసీఓఎన్ సదస్సు ప్రారంభ వేడుకల్లో పాల్గొన్న వైద్యుల బృందం

రాయదుర్గం: అంటువ్యాధులపై మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని పలువురు వైద్యులు సూచించారు. నానక్‌రాంగూడలోని షరటాన్ హోటల్‌లో ఇన్ఫెక్షియస్ డిసీజ్ కాన్ఫరెన్స్ (ఐడీసీఓఎన్)ను నానక్‌రాంగూడలోని షరటాన్ హోటల్‌లో మెడికవర్ ఆస్పత్రుల ఇంటర్నల్ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికవర్ ఆస్పత్రి క్లినికల్ సర్వీసెస్ డైరెక్టర్, సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శరత్‌రెడ్డి, సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ హరిరాధాకృష్ణ, సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి జ్యోతి వెలిగించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టమైన లేదా అరుదైన అంటు వ్యాధుల నేపథ్యంలో అవగాహన పెంచడం, సంసిద్ధతను పెంపొందించే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. అంటు వ్యాధులు దేశాలను ప్రభావితం చేసే ఒక ముఖ్యమైన ప్రపంచ సవాలుగా మారుతాయన్నారు. ఇది వైరల్ వ్యాప్తి, బాక్టీరియల్ ఇన్ఫెక్షన్ లేదా కొత్త వ్యాధుల ప్రభావం తీవ్రంగా, చాలా దూరంగా ఉంటుందన్నారు. ఆరోగ్య సంరక్షణ నిపుణులు, సాధారణ ప్రజలకు సమాచారం ఇవ్వడం, అవసర మైన జ్ఞానాన్ని పొందడం, అంటువ్యాధులతో సంబంధం ఉన్న ప్రమాదాలను తగ్గించడానికి నివారణ చర్యలను అనుసరించడం అవసరమన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, 200కు పైగా మెడికల్ కాలేజీల నుంచి స్టూడెంట్స్ పాల్గొన్నారు.

మైహోం జ్యువెల్‌లో ఉచిత డయాబెటిక్ క్యాంప్



ఉచిత డయాబెటిక్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

హఫీజ్‌పేట్: లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మదీనాగూడ మైహోం జ్యువెల్‌లో ఉచిత డయాబెటిక్ క్యాంప్ ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా లయన్స్ క్లబ్ యాదయ్య గౌడ్, జోనల్ చైర్‌పర్సన్ కోట్ల రామ్మోహన్‌రావు, అధ్యక్షుడు నాగూర్‌రావు, కార్యదర్శి చెన్నూరి దుర్గా ప్రసాద్‌రావు, మాజీ అధ్యక్షులు లయన్ నారాయణరావులు హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మైహోం జెవెల్‌లో పని చేసే హౌస్ కీపింగ్, సెక్యూరిటీ, వివిధ రకాల ఉద్యోగులకు ఉచితంగా డయాబెటిక్ పరీక్షలు నిర్వహించారు. దాదాపు 250 మందికి ఈ పరీక్షలు చేసినట్లు వైద్యులు పేర్కొన్నారు.

యువతరానికి స్ఫూర్తి శివాజీ



శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: నేటి యువతరానికి స్ఫూర్తి ఛత్రపతి శివాజీ మహారాజ్ అని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శివాజీ మహారాజ్ గొప్ప పోరాటయోధుడే కాకుండా గొప్ప పరిపాలనాదక్షుడుగా పేరు పొందారని కొనియాడారు. చరిత్రలో గొప్ప నాయకులుగా కీర్తించబడ్డ మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నియోజకవర్గంలో శివాజీ విగ్రహాల ఏర్పాటుకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. యువత పెడదారి పట్టకుండా దేశ భవిష్యత్తు నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం గండిగూడెం గ్రామంలో నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, దాయర సర్పంచ్ భాస్కర్‌గౌడ్, సీనియర్ నాయకులు రాజు, మల్లేష్, శ్రీకాంత్, గ్రామ పుర ప్రముఖులు, యువకులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

పటాన్‌చెరు: రైతాంగానికి అందిస్తున్న ఉచిత విద్యుత్ అంశంపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వైఖరిపై ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా శాసనసభ్యుడు, సీనియర్ నాయకులతో కలిసి ఆదివారం భారత రాష్ట్ర సమితి శాసన సభా పక్ష కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో రేవంత్ రెడ్డి లాంటి నాయకుడిని చూడలేదన్నారు. ముఖ్యమంత్రిని తిట్టి రాజకీయాల్లో ఎదగాలంటే తెలంగాణ ప్రజలు తరిమి తరిమి కొడతారని హితవు పలికారు. రైతులకు 24 గంటల విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. ఈ అంశంపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతానికి చెందిన ఉమ్మ డి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి టంగు టూరి అంజయ్య సంస్కారంలో ఉన్నతుడిగా కీర్తి పొందారన్నారు. మంత్రి హరీశ్‌రావుపై అ నుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు.

రసాయన డ్రమ్ముల పారబోత

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని ఖాజీపల్లి గ్రామ శివారులో గుర్తుతెలియని వ్యక్తులు రసాయన డమ్ములను పడేశారు. సుమారు 20 డ్రమ్ములు పారవేయటంతో భారీగా ఘాటు వాసనాలు వెలువడ్డాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న సర్పంచ్ సత్య నారాయణ, ఎంపీటీసీ భార్గవ్ ఘటనా స్థలానికి చేరుకుని, డ్రమ్ముల విషయాన్ని పీసీబీ అధికారుల కు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా రసాయన డ్రమ్ములను పారేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని స్థానిక నాయకులు డిమాండ్ చేశారు.

కళాసిల్క్ చేనేత హస్తకళ ప్రదర్శనకు ఆదరణ

మోతీనగర్: మోతీనగర్ కమ్యూనిటీహాల్‌లో కొన్ని రోజుల నుంచి నిర్వహిస్తున్న కళాసిల్క్ చేనేత హస్తకళ ప్రదర్శనకు స్థానికుల నుంచి విశేష స్పందన లభిస్తుందని నిర్వాహకులు సంజయ్‌జైన్, వినోద్ జైన్ పేర్కొన్నారు. ఈ మేళాలో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో చేనేత కార్మికులు తయారు చేసిన వివిధ రకాల చేనేత వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ మేళా ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. అన్ని రకాల డెబిట్, క్రెడిట్ కార్డులు ద్వారా కొనుగోలు చేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత వాసులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.



రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, నటుడునిర్మాత మురళీమోహన్ తదితరులు

ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

రాయదుర్గం: అన్ని దానాలకంటే గొప్పది రక్తదానమని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలోని గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్స్‌లో గ్రీన్ గ్రేస్ ఎంఏసీ సొసైటీ, నారెడ్కో తెలంగాణ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ఆయన నటుడు, నిర్మాత ఎం.మురళీమోహన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఔత్సాహిక యువతీయువకులు రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. రాష్ట్రంలో రక్తనిల్వలు తగ్గకుండా ఉండేందుకు అందరూ రక్తదానం చేయాలన్నారు. రక్తదానం చేయడంతో వ్యక్తి ప్రాణాలు కాపాడేందుకు దోహదం చేస్తుందన్నారు. మురళీమోహన్ మాట్లాడుతూ... రక్తదానం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకొస్తే కొందరి ప్రాణాలు నిలిపేందుకు అవకాశం కలుగుతుందన్నారు. నారెడ్కో తెలంగాణ అధ్యక్షుడు బి.సునీల్ చంద్రారెడ్డి మాట్లాడుతూ... రక్తదాన శిబిరాలను నిర్వహించడం ద్వారా బ్లడ్ బ్యాంక్‌లలో రక్త లభ్యతలో అంతరాన్ని తగ్గించడంలో మేము దోహదపడుతున్నామన్నారు. నారెడ్కో తెలంగాణ నిర్వహించే రక్తదాన శిబిరాల నిర్వహణకు ఇతర సంఘాలు సహకరించాలన్నారు. నారెడ్కో తెలంగాణ రాష్ట్ర సెక్రటరీ జనరల్ విజయ సాయిమేక, గ్రీన్ గ్రేస్ మాక్ సొసైటీ అధ్యక్షుడు బి.వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి ఎస్.నర్సింహారెడ్డి, కె.శ్రీధర్‌రెడ్డి, బి.వెంకటరమణారెడ్డి, పలువురు సభ్యులు, అపార్ట్‌మెంట్‌వాసులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. కూచిపూడి నృత్యం

మాదాపూర్: కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం ప్రవాస భారతీయులు యూస్, ఫ్లోరిడా నుంచి పసుమర్తి సిస్టర్స్, మధిర సిస్టర్స్ అనన్య, అనుష్కలు కూచిపూడి నృత్యప్రదర్శనలతో అలరించారు. ఇందులో గణేశశ్లోకం, జతిస్వరం, మండూకశబ్దం, కొలువైతివారంగా సాయి, శివాష్టకం తదితరు అంశాలను ప్రదర్శించి అలరించారు. పసుమర్తి సిస్టర్స్ ప్రణతి, ప్రత్యూషలు మరకత మణిమయ, ఒకపరి ఒకపరి తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు.



డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలి



మాట్లాడుతున్న వాజీద్‌అలీ

పటాన్‌చెరు టౌన్: పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ వాజీద్‌అలీ డిమాండ్ చేశారు. ఆదివారం పటాన్‌చెరులో సీపీఎం పట్టణ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాజీద్ అలీ మాట్లాడుతూ పటాన్‌చెరు, రామచంద్రపురం పట్టణ ప్రాంతాల పేదలు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు దరఖాస్తులు చేసుకోగా నేటివరకూ నియోజకవర్గంలో ఒక్కరికీ కూడా ఇవ్వలేదని వాపోయారు. పోచారం, ఘణపూర్ చౌరస్తా సమీపంలో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, అర్జున్, యాక రామచంద్రమూర్తి, సురేష్ పాల్గొన్నారు.